

# బాంధవ్యం

గోపాలచక్రవర్తి

వాన కురుస్తూవున్న వొకరాత్రి. పదకొండు గం॥ సమయం. రామ్మూర్తి సిగరెట్ పీలుస్తో మునిస్వామి కోళ్ళకొట్టు మూరుక్రింద నిలబడి వున్నాడు. బాటమీద వర్షపునీళ్ళను చీల్చుకుంటూ శబ్దంచేస్తూ ఎవరో మనుష్యులు వస్తున్నట్టయింది. అతను తలయెత్తి చూశాడు.

మేనకాదేవీ, ఆమెభర్త రామదాసూ ఏకచ్ఛత్రాధిపత్యం క్రింద వస్తున్నారు. రామ్మూర్తి ఛట్టున సిగరెట్ పారేసి ఆమెకు నమస్కరించాడు. ఆమె గొడుగు భర్తకిచ్చి, చూరు క్రిందకువచ్చి 'దీక్షగా, తీవ్రంగా చదవాలని నాతో చెప్పి యిట్లా నిసిరాత్రిరి వర్షాదేవి సౌందర్యాన్ని చూస్తూ రోడ్లమీద తిరుగుతున్నావా బాబూ' అని ప్రశ్నించింది. రామ్మూర్తి నవ్వాడు. 'ఈ వర్షంలో రూమ్ కేమి వెళ్తావులే. మా కేసిల్ కి రా పడుకుందుగాని' అన్న మేనకాదేవిమాటకి అంగీకార సూచకంగా రామ్మూర్తి తల వూపాడు.

ముగ్గురూ మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. వాయుదేవుడూ వరుణదేవుడూ సరసా లాడుకుంటున్నారు. బాట కిరువైపులా వున్న వృక్షమూర్తులు వీళ్ళనిచూసి నవ్వుతున్నాయి.

* * *

మేనకాదేవి నగరంలోని కళాశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయిని. ఆమె గణితం అత్యద్భుతంగా చెప్పుతుందనీ, క్లిష్టమైన విషయాలనుకూడ సులభంగా విద్యార్థుల మస్తిష్కంలోకి ప్రవహించేటట్లుచేస్తుందనీ ప్రతీతి. రామ్మూర్తి ఆమె శిష్యుడు. నాల్గవసంవత్సర విద్యార్థుల్లో ప్రథమ శ్రేణికి చెందిన అతనంటే ఆవిడకు ఎంతో యిష్టం. రామ్మూర్తి సంపెంగపూవువాసన వంటివాడు. ఎక్కడవున్నా యితరులను యిట్టే ఆకర్షిస్తాడు. సునిశితమైన మేధస్సుతో సారస్వతంగూర్చి మాట్లాడేవాడూ, ఇతరులను నవ్విస్తూ తాను నవ్వుతూ కావ్యవిమర్శన రవ్వలు రువ్వేవాడూ, వాల్మీకి మొదలు పాండావాసిలివెస్కీ వరకూ క్షుణ్ణంగా చదివినవాడూ రామ్మూర్తి. తొలిసారి అతన్ని చూసినప్పుడే ఆవిడ జీనియస్ క్రింద జమకట్టేసింది. ప్రపంచంలోకి వచ్చిన తరువాత పద్ధెనిమిది హేమంతాలు మాత్రమే చూసిన రామ్మూర్తి, జీవితంలో ఆమెతో అంత సన్నిహిత బాంధవ్యం ఏర్పడుతుందని ఎప్పుడూ అనుకోలేదు. రామ్మూర్తి కష్టమైన సమస్యలు ఏరి, క్లాసులోఆవిడ ఎదుటపెట్టి ఎట్లాచెయ్యాలో చెప్పమని అడిగేవాడు. మేనకాదేవి శ్రద్ధగా విడమర్చి చెప్పేది.

ఒకనాటి సాయంకాలం ఆమెగృహానికి మరలుతున్నది. వింతవింత రహస్యాలు కదులుచున్న సాయంత్రపుగాలి. గులాబీకాంతుల్ని విరజిమ్ముతూన్న కరిగిపోయే నీరెండ. రెడార్మీ యోధుడివలె పెద్దఅంగలతో నడక ప్రారంభించి రామ్మూర్తి ఆమెను కల్సుకొని 'ఎస్ట్రానమీ' లో ఏవో సందేహాలున్నాయనీ, చెప్పమనీ అడిగాడు.

ఆమె అప్రయత్నంగా అతని మొహంలోకి చూసింది. పదేళ్ళక్రితం మరణించిన కొడుకు అవి

డను జ్ఞాపకమొచ్చాడు. స్నిగ్ధమై, ధవళమై, సహజకోమలమై ప్రకాశించే అతని వదనాన్ని ఆమె మళ్ళీమళ్ళీ చూసింది. మెరిసే విశాల ఫాల భాగం, నల్లని శిరోజాలూ......అదేపోలిక ఆవి డకు గోచరించింది.

అసలు విషయాన్ని మరచి ఇద్దరూ ఏమిటే మిటో మాట్లాడుకుంటూ మేనకాదేవి యింటిని చేరుకున్నారు. సాయంకాలం వెళ్ళిన రామ్మూర్తి రాత్రి పదిగంటలకు ఆవిడతో ఫోంచేసి గదిని చేరు కున్నాడు.

ఇట్లా తరువాతనాలుగైదుసార్లు సంభవించింది. రామ్మూర్తి మేఘమేటికన్న మేనకాదేవితో తిరుగు తున్నాడన్రోయ్ అంటూ మధురమైన కథలు ప్రచారంలోకి రావడానికి ఆట్టేకాలం పట్టలేదు. ఇంతటితో ఆగిపోతే బాగుణ్ణు. కాని అట్లా సంభ వించలేదు.

రోజూ రాత్రి పదిగంటలకు రామ్మూర్తి గది వద్దకువెళ్ళి ఆవిడ పిలిచేది. ఇద్దరూ కలిసి మాట్లాడు కుంటూ మైళ్ళకొలది దూరం నడిచివెళ్లేవారు. మిణుగురు పురుగుల్నీ, మినుకుమినుకుమనే నక్ష త్రాల్నీ, చరగోత్రవిభుని చక్కని మీసాలవలె వున్న చీకటినీ చూస్తూ కారునల్లని నీడలమధ్య యిద్దరూ కూర్చునేవారు. సారస్వతవిషయాల్లో ఆమె మౌనం వహించేది; అతడు గానం చేసే వాడు. వింతవింత విషయాలూ, ఖగోళవిషయాలూ ఆమె చెప్పేప్పుడు అతను శ్రోత.

సూర్యుడు పూర్వపర్వతమ్మీద ఉదయిస్తూ వుంటే ఆవిడ స్నానంచేసి తొందరగా రామ్మూర్తి గదికివెళ్ళి అతన్ని వెంటబెట్టుకొని యింటికి కాఫీకి తీసుకువచ్చేది.

ఊళ్లో కొంత అలజడి బయలుదేరింది. రామ్మూర్తీ, మేనకాదేవి వెళ్తూవుంటే వెనకాలే కొంతమంది వెక్కిరించేవారు. రామదాసు ఒక సారి ఆమెనుపిలిచి అతనితో తిరగడం మానెయ్య మనీ, నలుగురూ నవ్వుతున్నారనీ చెప్పాడు. ఆమె వినలేదు. 'అతన్ని జాగ్రత్తగా పరిశీలించండి. బాబిగాడిలా లేడూ? అదే ముఖం. అవే కళ్లు. అనోయ్ ఎంతపోలిక! రామ్మూర్తి అంటే నాకే విధమైన మలినమైన ఊహలూ లేవు. నాకు కొడుకువంటివాడు. మీరుకూడా తక్కినవాళ్ళకు మల్లే అపోహలుపడితే ఏంలాభం. రామ్మూర్తి మెదడులో యింకా స్త్రీపురుష సంబంధం గూర్చి ఆలోచనలు లేనేలేవు. విపరీతంగా, అనర్గళంగా ఎస్మరాల్డ, ఊర్వశి, సలోమి, పౌలోమి అంటూ మాట్లాడ్డంతప్ప యథార్థానికి అతను పసిపిల్లవాడు' అని ఆమె చాల చెప్పేది. ఊళ్లో ఎవరైనా మీ కెంతమంది పిల్లలు అని అడిగితే రామ్మూర్తి తన కొడుకని చెప్పేది మేనకాదేవి.

ప్రిన్సిపాల్ ఒకసారి ఆమెను పిలిచి సలహా యిస్తున్నట్టుగా మాట్లాడి రామ్మూర్తితో ఆవిడ తిరుగుతున్నట్టు తనకు ఆకాశ రాతున్న లేఖలు వచ్చాయనీ, కొంచెం జాగ్రత్త వహించాల్సిందనీ చెప్పాడు. ఆవిడ ఆడపులివలె గర్జించి కోపంతో బయటకు వచ్చేసింది. ముప్ఫయ్ అయిదేళ్ళ తనకీ పద్దెనిమిది సంవత్సరాల రామ్మూర్తికీ ఎటువంటి సంబంధం కల్పిస్తున్నారు!

ఆమె బలహీనత ఒక్కొక్కప్పుడు ఆమెకు తెలిసేది. రామ్మూర్తిని ఒక్కరోజు చూడకపోతే ఎందు కావిధంగా బాధపడాలి? అతనితో రాత్రంతా ఆడుకొని ఏ ఒంటిగంటకో యింటికి రావడమేమిటి? కాని మరుసటి ఉదయాన్నే శర త్కాల మేఘంవలె, తరంగ రహిత క్షీరసాగరం వలె, తెల్లగలువవలె ధౌతదుకూలాలతో గోమును చక్రవర్తిలావున్న అతన్ని చూడ్డంతోటే ఆమెకళ్లు చెమ్మగిలేవి. ఎన్ని జన్మాల బాంధవ్యమో యిది?

*   *   *

యూనివర్సిటీ పరీక్షలైపోయిన తరువాత ఫలి తాలు వచ్చేవరకూ మేనకాదేవికి నిద్రపట్టలేదు. విశ్వవిద్యాలయ ప్రథముడుగా రామ్మూర్తి గణి తంలో వస్తాడా, రాడా అనేది ఆవిడ భయం. కాని ఆమె రామ్మూర్తి ఘోరంగా ప్రథముడుగానే వచ్చాడు. అతని బంగారు ఆశ యాలకు అమృత పయస్సు కురిపించిన మేనకాదేవి హృదయం ఆనందంతో కెవ్వుమని కేకవేసింది. అలని గుండె లోతుల్లోని తియ్యని కలలకు నారుపోసి నీరుపోసిన మేనకాదేవి ఆకాశ చుంబిత భవనంలోకి విసిరివేయ బడ్డట్టుగా భావిం చింది. ఆమె శరీరం నదీ ప్రవాహమై ప్రపంచ మనే ఆనకట్టను త్రెంచుకొని సుడులతో వడిగా, వడివడిగా ముందుకు సాగినట్టనిపించింది.

నగరాన్ని విడిచిపెట్టి రామ్మూర్తి మహానగ రానికి పెద్ద చదువుకోసం పయనించాడు. మేనకా దేవి పడిన బాధనెట్లా వర్ణించడం? ఒక్క కొడుకూ చదువుకోసం వెళ్ళి పోతూవుంటే తల్లిపడే బాధ. రోజు కొక ఉత్తరం ఆవిడ దగ్గర్నించి అతనికి ఎగిరేది.

మూడునెలలు గడిచాయి.

ఆమెకు జీవితం భారంగా తోచింది. అతన్ని చూడాలనే కోరిక రోజురోజూ తీవ్రమైపోయింది ఆమెలో. రామదాసును అడిగినది మేనకాదేవి ఒకసారి వెళ్లివస్తానని. అతను మొదట వొద్దన్నా చివరకు ఒప్పుకున్నాడు. మేనకాదేవి బయల్దేరింది. హుటాహుటిగా ఆడావుడిగా మహానగరాన్ని చేరు కుంది.

రామ్మూర్తి ఆమెను చూడ్డంతోటే ఆశ్చర్య పడ్డాడు. 'ఎట్లావచ్చారు' అని ప్రశ్న. దిగివచ్చిన దేవకన్యను అని ఆవిడ సమాధానం. నాటి సాయం కాలం వాళ్ళిద్దరూ తొల్లిటి ఆనందాన్ని పొందారు. రకరకాల రంగురంగుల విషయాలగురించి మాట్లాడు కుంటూ అట్లా కూర్చుండిపోతే వాళ్ళకు కాల గమనం గూర్చి ఆలోచన వుండనే వుండదు.

రామదాసు ఉత్తరంతో మేనకాదేవి గుండె ఆగిపోయింది. 'నాదగ్గిరకు రావొద్దు. రామ్మూర్తి తోనే కాపురం చెయ్యి' అనే రామదాసు లేఖ ఆమెను చలనం లేకుండా చేసింది. ఇంకా అర్థం చేసికోలేదు రామదాసు తన స్వభావాన్ని! అటు వంటివాడు ఎందుకువెళ్లి రమ్మన్నాడు? రామ్మూర్తి మీరు వెళ్ళిపొండి మేనకా దేవీ' అన్నాడు. మేనకాదేవికి ఏం చెయ్యడానికీ తోచలేదు. ఏడుపూ, నవ్వూ ఏమీరాకుండా ఆవిడ ఉప్పు బొమ్మమల్లే అట్లా నిలబడిపోయింది.

* * *

మేనకాదేవి మళ్లీ నగరాన్ని చేరుకుంది, మహా నగరాన్ని విడిచిపెట్టి. కళాశాలకు ఆవిడ రోజూ వెళ్తున్నది. ఇంకా గణితంలో ప్రాబ్లమ్సు చెప్తు న్నది. కాని ఆమె జీవితం మట్టుకు బ్రాకెట్లలో యిరుక్కుపోయి బయటకు రాలేకపోయింది.

పూర్వపు మేనకవేరు. నాటిమేనక కళ్ళల్లో పారవశ్యంతో, వింత ఆకర్షణతో ఒక అపూర్వ వ్యక్తివలె గోచరించేది. నేటి మేనక నిర్జీవంగా బ్రతుకుతున్నది కాలాన్ని నెట్టుకుపోతూ, యాంత్రి కంగా రుచిలేని రోజులను దొర్లిస్తూ. విద్యార్థినిగా, ప్రేయసిగా, ఉపాధ్యాయినిగా రంగురంగుల సమ యాల్లో రసజీవితంలోని రమ్యత ఆవిడ సాక్షా త్కరింప చేసుకుంది. కాని మాతృస్థానం మట్టుకు ఆవిడకు కరవయినది. తెల్లని చంద్రకిరణాలూ, సెలయేళ్లూ, ఝుంఝానిలాలూ, విశాలసైకతాలూ ఆవిడను అంతగా కది లించవు. 'ఆ సూర్యుడే నేడూ, ఆచంద్రుడే నాడూ, అవే నక్షత్రాలు ఐనా కాలంమారింది.'

ఆమె అంతరాంతర జీవితంలో ఒక భాగమై పోయిన రామ్మూర్తిని గుండెల్లోనుంచి ఎట్లా పీకి వెయ్యడమో ఆవిడకు తెలియటంలేదు. ఆవిడ హృదయగోళంలోని సెందురుని-చూసిన గభీరసాగర కల్లోలాన్ని ఎవ్వరాపగలరు?

నీకు జరిగిన అన్యాయాలు గురించి ఎంత తక్కువ వాపోతే అంత మంచిది; ఏమంటావా, సర్వసామాన్యంగా, వాపోయే మనిషి పాపంచేస్తూన్న వాడితో జమ. ఎందుకంటే—ఆత్మానురాగం మనకు జరిగిన ఎగ్గును గోరంతలు కొండంతలు చేసి చూపుతుంది—సెయింట్ ఫ్రాంసిస్ డి సేల్స్.